

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 | నిజామాబాద్ ఆదివారం 2 జూన్ 2024 | ADILABAD NIRMAL



# కౌంటింగ్‌కు రెడీ

● మూడు కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

ఆదిలాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ) : మే 13వ తేదీన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి పోలింగ్ జరుగగా.. ఈ నెల 4న కౌంటింగ్ నిర్వహించడానికి అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను టీటీడీసీ, ఖానాపూర్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల ఓట్లను సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్లను సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లెక్కించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను బూత్‌ల ఆధారంగా లెక్కింపు జరగనుంది. ఇందుకోసం అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవీఎంలలో పోలైన ఓట్లను రౌండ్‌లవారీగా లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు జరగనుండగా ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓట్లను లెక్కించడానికి కౌంటింగ్ సూపర్ వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను నియమించగా వారికి అధికారులు శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి భోజనం, మౌలిక వసతులతోపాటు తాగునీరు, టాయిలెట్స్, వైద్య సౌకర్యం అందుబాటులో ఉంచుతారు. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6 గంటలకు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

### 48 గంటల్లో తేలనున్న భవితవ్యం

మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 74.03 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి ఎక్కువ పోలింగ్ జరిగింది. 2019 ఎన్నికల్లో 71.35 శాతం పోలింగ్ నమోదు కాగా ఈ ఎన్నికల్లో 74.03 శాతానికి పెరిగింది. ఈ ఎన్నికల్లో పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో ప్రజలు ఉత్సాహంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2020 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చి మూడంచెల పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్‌కు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండడంతో వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో టెన్షన్ నెలకున్నది. ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా సైలెంట్ ఓటింగ్ జరిగింది. పోలింగ్ అనంతరం ఆయా పార్టీల అభ్యర్థులు తమ నాయకులతో చర్చించి ఓటింగ్ సరళిని అంచనా వేశారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ విజయంపై ధీమా వ్యక్తం చేస్తుండగా మరో 48 గంటల్లో వారి భవితవ్యం తేలనుంది.

# వచ్చింది క్వింటాళ్లు.. పట్టుకునేది కిలోలు

## సీజన్‌కు ముందే ఉమ్మడి జిల్లాకు చేరుకున్న నకిలీ పత్తి విత్తనాలు

- క్వింటాళ్ల కొద్దీ దిగుమతి కాగా.. అధికారులు కిలోలే పట్టుకుంటున్నరు..
- విత్తనాలు ఏ రాష్ట్రంలో పట్టుబడినా ఉమ్మడి జిల్లాతో లింకు
- మాఫియాను అరికట్టడంతో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలం
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పడిగాపులు.. మంచిర్యాల, ఆసిఫాబాద్‌లలో నకిలీ దందా
- యేటా వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులకు రూ.6 కోట్ల మామూళ్లు
- నకిలీ కట్టడికి టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు

*మంచిర్యాల జిల్లాకు చెందిన గునుగుంట్ల వీరమణికంఠ, ముండ్రు మల్లికార్జున్, కోటా సాంబశివరావులు పల్నాడు జిల్లాకు చెందిన గండవల్ల శ్రీరంగతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా చదలవాడ గ్రామానికి చెందిన పెండ్యాల జగదీశ్వర్‌రావు వద్ద నకిలీ విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేశారు. ఆ విత్తనాలను తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తుండగా మే 25వ తేదీన నల్గొండ జిల్లా ఈదులగూడెం కూడలి పోలీసు పట్టుకున్నారు. ఈ క్రమంలో గండవల్ల శ్రీరంగ విత్తన ప్యాకెట్లను వదిలిపెట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో రూ.5 లక్షల విలువ గల 2.60 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. నిందితులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.*



పట్టుకున్న నాసిరకం విత్తనాలు, వ్యాన్, నిందితులతో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు


*కర్ణాటక నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న 5.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను రామగుండం పోలీసులు పట్టుకున్నారు. రూ.16.50 లక్షలు విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలను ఉల్లిగడ్డల లోడ్‌లో తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు.*

మంచిర్యాల, జూన్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో పట్టుబడుతున్న నకిలీ విత్తనాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో సంబంధం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినా, కర్ణాటక నుంచి వచ్చినా.. తెలంగాణ నుంచి మహారాష్ట్రకు వెళ్లినా.. ఇలా ఏ ఘటన చూసుకున్నా ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వ్యక్తులు ఈ దందాల్లో కీలక సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారు. సీజన్‌కు ముందే అంటే ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే ఈ విత్తనాలు జిల్లాకు చాటుగా చేరుకున్నాయి. సీజన్ ముందే నకిలీ విత్తనాలు జిల్లాకు వచ్చాయంటూ 'నమస్తే తెలంగాణ' గతంలోనే కథనాలను ప్రచురించింది. ఫిబ్రవరిలోనే మంచిర్యాల జిల్లా భీమిని మండలానికి వచ్చాయని.. దాదాపు 20 క్వింటాళ్లను పోలీసులే కావాలని తప్పించారనే ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. దీనిపై విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విచారణ కూడా సాగింది. ఉమ్మడి జిల్లాలో సాగయ్యే పత్తిలో దాదాపు 50 నుంచి 60 శాతం వరకు నకిలీ విత్తనాలే ఉంటాయంటే.. మన వద్ద దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కొందరు వ్యాపారులతో చేతులు కలిపిన జిల్లావాసులు అక్కడి నుంచి నకిలీ విత్తనాలు తెచ్చి విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచే మహారాష్ట్రకు కూడా తరలిస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి రెండు, మూడు నెలల క్రితమే విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. క్వింటాళ్ల కొద్ది విత్తనాలు వస్తే అధికారులు పట్టుకునేవి మాత్రం కిలోల్లో ఉంటున్నాయి. సీజన్‌కు ముందే టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పక్క జిల్లాల్లో మన జిల్లాకు వచ్చే నకిలీ విత్తనాలను క్వింటాళ్ల కొద్ది పట్టుకుంటుంటే.. మన జిల్లాలో మాత్రం కిలోల్లోనే ఉంటున్నాయి. పక్క రాష్ట్రాలకు మన దగ్గరి నుంచి వెళ్లే విత్తనాలను పట్టుకుంటున్న అధికారులు.. మన మార్కెట్‌లో నకిలీ విత్తనాలను అరికట్టడంలో విఫలమవుతున్నారే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ఒక వైపు పడిగాపులు.. మరోవైపు నకిలీ దందా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విత్తనాల విషయంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ జిల్లాలో విత్తనాల కోసం రైతులు క్యూలు కట్టి రోజుల తరబడి ఎదురు చూస్తుంటే.. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో విత్తన షాపుల వైపు చూసే నాథుడే కరువయ్యాడు. అంటే ఆ స్థాయిలో ఈ రెండు జిల్లాల్లో నకిలీ విత్తనాలు రైతులకు దొరుకుతున్నాయి. ఈ జిల్లాల్లో దుక్కులు దున్ని సాగుకు సిద్ధమైన రైతుల వద్ద దాదాపు 50 శాతం మంది వద్ద నకిలీ విత్తనాలే ఉన్నాయని తెలుస్తున్నది. ఇంత జరుగుతున్నా అధికారులు అడ్డుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి ఏడాది దాదాపు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు నకిలీ విత్తన దందా చేసే కేటుగాళ్లు వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులకు మామూళ్ల రూపంలో ముట్టజెపుతారనే ఆరోపణలు ఉన్నాయి. మందమర్రిలో నకిలీ విత్తనాల సరఫరా కేసులో పోలీసులు పట్టుకున్న ఓ వ్యక్తి స్వయంగా ఈ విషయాన్ని చెప్పినట్లు తెలుస్తున్నది. అధికారి స్థాయిని అనుసరించి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ముట్టజెపుతారని తెలుస్తున్నది. గత సీజన్‌లో నకిలీ విత్తన దందా చేసే వాళ్లు తనకు రూ.3.50 లక్షలు ఇచ్చారని, ఈ సారి అంతకంటే ఎక్కువ ఇస్తారనుకుంటున్నట్లు మంచిర్యాల జిల్లాలోని ఓ మండలంలో పని చేసే వ్యవసాయ అధికారే స్వయంగా చెప్పారు. ఆయన మాటలను బట్టి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో నకిలీ విత్తనాల దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

*ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ ఏరియాలో గల రాంనగర్ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ బ్యాక్ సైడ్‌లో ఉన్న గోదాంలో నకిలీ విత్తనాలను ప్యాక్ చేస్తున్న ముఠాను అధికారులు పట్టుకున్నారు. లక్షల రూపాయల విత్తనాలు, ప్యాకెట్లను సీజ్ చేశారు. మీనాక్షీ, పాండురంగ, బోల్‌గార్డ్, జే 15, పుడమి వంటి బ్రాండెడ్ కంపెనీల పేరిట ప్యాక్ చేస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్రకు ఈ విత్తనాలను తరలించేందుకు సదరు ముఠా సిద్ధమైనట్లు గుర్తించారు. ఈ వ్యవహారానికి కీలక సూత్రధారైన అశోక్‌రెడ్డి సహా మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.*



ఆదిలాబాద్‌లో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు

### టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేశాం..

**- సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి, మంచిర్యాల జిల్లా.**

నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేశాం. మండల ఎస్ఐ, అగ్రికల్చర్ ఆఫీసర్, రెవెన్యూ ఆఫీసర్ ఈ టీమ్‌లో ఉంటారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదు కేసులు నమోదు చేశాం. చెన్నూర్‌లో ఒకటి, భీమిని మండలంలో నాలుగు కేసులు అయ్యాయి. డీలర్లు, ప్రైవేటు వ్యక్తులు ఎవ్వరైనా సరే నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

# ఈవీఎం గోదాముల పరిశీలన

నిర్మల్ అర్బన్, జూన్ 1 : కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం సీలు తెరిచి ఈవీఎంలను పరిశీలించారు. నిరంతరం పటిష్ట భద్రత ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఎన్నికల విభాగం పరిశీలకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రవణ్ రెడ్డి, గాజుల రవి, గంద్రత్ రమేశ్ పాల్గొన్నారు.

### ఎన్నికల పరిశీలకుడికి సన్మానం

నిర్మల్, ఖానాపూర్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పరిశీలకులు అనిల్ కుమార్ పాండేను శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ స్వాగతం పలికారు. అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహణ, వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ తదితరులున్నారు.



ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లు

# అవతరణ వేడుకల ఏర్పాట్లు

ఎదులాపురం, జూన్ 1 : ఎన్నికల కోడ్ కారణంగా రాష్ట్ర అవతరణ వేడుకలను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కాకుండా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్నారు. దానికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని జరిగే జెండా ఆవిష్కరణ, అమరుల నివాళి కార్యక్రమానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ, అమరవీరుల స్తూపం వద్ద సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అమరులకు నివాళి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ జెండాను కలెక్టర్ రాజర్షి షా ఉదయం 9 గంటలకు ఆవిష్కరించానున్నారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే వేడుకలకు ఆయా శాఖల జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు రానున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు.



నిర్మల్ కలెక్టరేట్‌లో..



# అమరులకు జోహార్

- రాష్ట్ర ఆవిర్భావ వేళ తెలంగాణ అమరులకు నివాళి
- గన్‌పార్క్ నుంచి ట్యాంక్‌బండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ
- తరలివచ్చిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

*నేడు(ఆదివారం) తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. శనివారం రాత్రి ఏడు గంటలకు గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీలు దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు సుమన్, రామన్న పాల్గొని నివాళులర్పించారు. కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.*

# మరమ్మతులను త్వరిగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

జైనథ్, జూన్ 1 : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఉపయోగపడే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజర్షి షా లక్ష్మీ నారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాం సుందర్, ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంపీఈవో దిలీప్, ఐకేపీ ఏపీఎం భగవాన్, మండల విద్యాధికారి జి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాములు, ఎం.లస్మన్న పాల్గొన్నారు.

# అందుబాటులో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలు

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్ జిల్లాలో డిమాండ్ ఉన్న రాశీ 659 పత్తి విత్తనాలను ఈనెల 2వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతామని, ప్ర తి మండల కేంద్రంలో పాయింట్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం పట్టణంలోని పత్తి విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, స్టాక్ వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాంలను సందర్శించి స్టాక్‌ను రిజిస్టర్‌లో నమోదై ఉన్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. 1.50 లక్షల ప్యాకెట్లను కంపెనీ నుంచి తెప్పిస్తున్నామని, ఇప్పటి వరకు 60 వేల ప్యాకెట్లు రైతులు కొనుగోలు చేశారన్నారు. 2వతేదీ నుంచి 90 వేల ప్యాకెట్లు విత్తనాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతించిన వేరే కంపెనీ విత్తనాలను కూడా కొనుగోలు చేయాలని సూచించారు.



పత్తి విత్తన షాపులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

